
‘ఆత్మాభిమానం’తో ‘సుఖదుఃఖాల’ తీరాలకు నెట్టిన వనిత!

# ఝంకారిణి



## సీత

రెండు రోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. బంగాళాఖాతంలో వాయుగుండంట. మరో నలభై ఎనిమిది గంటల దాకా ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుందని చెప్పారు ప్రాంతీయ వార్తల్లో.

నెత్తిమీద గొడుగున్నా జల్లుకొట్టి సుబ్బరంగా తడిసిపోయాను.

రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. ఎప్పుడో ఉండి ఉడిగీ ఓ బస్సు ఓ ఆటో వెళుతున్నాయంతే. స్టేషను ముందున్న బస్టాపులో నేనూ, మరో ముసలాయన మాత్రం ఉన్నాం. వేరుసెనక్కాయల జంగిడితో గరంగరం అంటూ నాముందు మంచి పెరేడ్ చేసి వెళ్ళాడు ఆ బక్కపల్చటి మనిషి.

చలిగాలికి సన్నగా వణుకుతున్నాను.

మా కాలనీకి వెళ్ళే బస్సు రావడానికి ఇంకా టైముంది. వాతావరణం ఇలా ఉందని బస్సు తీసుకురాకపోతేనో? ఆ ఆలోచనే భరించలేనిదిగా అనిపించింది. ఈ వానలో అంతదూరానికి ఆటోకూడా రాదు.

ఆకాశంలో పెద్దమెరుపు. ఎక్కడో పిడుగు పడింది.

"అర్జునః ఫాల్గుణః పార్థః కిరీటీ శ్వేతవాహనః ధనంజయః..." మనసులో అనుకుంటున్నాను.

చేతులు దగ్గరగా కట్టుకుని సిమెంటు బెంచీమీద కూచున్నాను.

టైము నడవడంలేదు ఎంతకీ.

అంతలో ఓ బస్సు వచ్చి ఆగింది స్టాప్‌లో. నే వెళ్ళాల్సిన బస్సుకాదు.

నువ్వు ఎక్కదల్చుకున్న రైలు ఓ జీవితకాలంలేటు... అని ఎవరన్నారోకానీ అది ఈ సిటీబస్సులకి కూడా అన్వయించుకోవచ్చు. జీవితంలో సగం వెయిటింగ్‌కే సరిపోతోంది ఖర్మ.

"ఏ బస్సుకి వెళ్ళాలి?"

తలతిప్పి చూశాను. ఆ అమ్మాయే. ముఖపరిచయం అనొచ్చో లేదో తెలీదు కానీ మా మధ్య ఉన్నది అలాంటి పరిచయమే. రోజూ తనని అక్కడ చూస్తూ ఉంటాను. టెర్లిన్ చీర కట్టుకుని తల్లో ఇన్ని పువ్వులు పెట్టుకుని అనవసరంగా నవ్వుతూ ఆ వైపు అని తెలుస్తూనే ఉంటుంది. వలిగిన ముద్దమందారంలా ఉంటుంది అని తనని గురించి చాలాసార్లు అనుకున్నాను.

భర్త వాడిలో ఒద్దికగా ఒదిగిపడుకునో, ఓ చెయ్యి తలకింద పెట్టుకుని మరో చెయ్యి బిడ్డమీద వేసి అమ్మగా కమ్మగా నిదరోతూనో ఉండాల్సిన స్త్రీమూర్తి. ఈ వేళలో ఇలా కన్పించడం బాధనిపించింది.

"మిమ్మల్నే?" రెట్టించింది ఆ అమ్మాయి.

చెప్పేను.

"ఆ బస్సుకి ఇంకా టైముందిగా"

"ఊ"

"మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. రండి కాసేపుండి వెళుదురుగానీ"

ఏమనాలో తెలీలేదు. నేను ఈ పిల్లతో మాట్లాడ్డం ఎవరేనా చూస్తే ఏం బావుంటుంది

"ఇంటికెళ్లి వేడి టీ తాగుతూ మాట్లాడుకోవచ్చు, రండి" అంటూ చొరవగా చెయ్యి పట్టుకొందావిడ. ఆ తర్వాత... అతను తల పట్టుకోవాల్సి వచ్చింది... ఎందుకో మరి!

అదృష్టవశాత్తూ అక్కడున్నది మేమిద్దరమే.

"నేనలాంటివాణ్ణి కాను" గొంతు పెగల్చుకుని చెప్పాను.

నవ్వేసింది.

"నిర్మొహమాటంగా..."

ఆ అమ్మాయి నా దగ్గరనుంచి వెళ్ళిపోతే బావుణ్ణనిపించింది.

"డబ్బుల్లేవా?" గోముగా అడిగింది.

"డబ్బుల గురించి కాదు. నాకు ఇలాంటివి ఇష్టం ఉండవు"

"ఇలాంటివంటే" కళ్ళార్పుతూ అడిగింది.

ఏం చెప్పాలి.

"ఈ వర్షం ఏమిటో... మూడు రోజులయింది" అరచేయి తెరచి చూసుకుంటూ అంది. వాక్యం అసంపూర్తిగా ఉన్నా విషయం అర్థమయింది. పాపం అన్పించింది. ఆ వేళే జీతాలు ఇచ్చారు ఆఫీసులో.

జేబులో చెయ్యిపెట్టి కవరు తీసి ఐదు పది నోట్లు బైటికి లాగాను.

"ఇవి ఉంచు"

"ఏమిటదీ" ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది. తల మీంచి జారిన నీటి బిందువులకి తిలకం బొట్టు కరిగి ముక్కుమీదుగా జారుతోంది.

ఆ అమ్మాయి నాకు అప్పుడు ఎంతో అందంగా కన్పించింది. గాన్ వెక్స్ట్ డోర్‌లా.

"బిచ్చం వేస్తున్నారా?" ఆ గొంతులో డగ్గుత్తిక.

"ఛఛ.. అలా అని కాదు"

"ఇంటికెళ్ళి వేడి టీ తాగుతూ మాట్లాడుకోవచ్చు రండి" చొరవగా చెయ్యి పట్టుకుంది తను.

ఒకే గొడుగులో ఇద్దరం దగ్గరదగ్గరగా నడుస్తున్నాం.

తన భుజం నాకు మెత్తగా తగులుతోంది.

ఆ అమ్మాయిలో ఏదో వింత ఆకర్షణ ఉంది.

"నీ పేరేమిటి?"

"లక్ష్మి. అమ్మ పెట్టిన పేరే"

అమ్మానాన్న పెట్టిన పేరే అవకపోవడం గమనించేను.

"బావులేదా..."

"ఏమిటి?"

"అదే.. నాపేరు. పోనీ మీకు ఇష్టమైన పేరుతోనే పిలవండి.. ప్రియా అని"

"ఆ పేరంటే నాకు ఇష్టమని నీకెలా తెలుసు?"

"ఎందుకో అన్పించిందలా" గేటు తీసి లోపలికి నడుస్తూ అంది.

ఓ అరగంట సేపు తనతో గడిపి బైటికొచ్చేను. వాన కాస్త తగ్గింది అప్పటికి. వానలో తడిస్తే నాకు పడదేమో. మర్నాడు కొంచెం ఫీవరొచ్చింది. ఆఫీసుకి నాలుగు రోజులు సెలవు పెట్టాను.

తర్వాత నాకు మరో ఊరికి ట్రాన్స్‌ఫరైంది. ఎప్పుడైనా హెడ్డాఫీసుకి పనిమీదొచ్చినప్పుడు మాత్రం అక్కడ లక్ష్మికోసం నా ప్రయత్నం లేకుండానే నేను చూస్తూ ఉంటాను.

మళ్ళీ తను నాకు కన్పించలేదు.

కాని తన ఆత్మాభిమానాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను.

రెండు రోజులుగా బేరాలు తగలక తిండితిప్పలు లేకున్నా తను నా దగ్గర ఊరికే డబ్బులు తీసుకుందుకు అంగీకరించలేదంటే ఎంత గొప్పమనిషి తను.

అలాగే మరొకందుకు కూడా నేను లక్ష్మిని మర్చిపోలేను.

రెండు మూడు నెలలకోసారి నేను 'అందుకని' డాక్టర్ దగ్గరికి వెళ్ళవలసి వస్తూనే ఉంది ఇప్పటికీ.

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్